# పావురాలతో పొంచి ఉన్న ముప్పు ..?

**-వాటి రెట్టలతో శ్వాసకోశ వ్యాధులు**
**-ఇంటి వద్ద పెంచే వారిలోనూ బయటపడుతున్న ఇన్‌ఫెక్షన్లు**
**-అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న డాక్టర్లు**

**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:** ఊళ్లల్లో కాకులు, చిలుకలు, పిచ్చుకలు ఎక్కువగా కనిపిస్తాయి. హైదరాబాద్‌లో అయితే ఎక్కడ చూసినా పావురాలు గుంపులు గుంపులుగా కనిపిస్తాయి. భాగ్యనగరం పావురాలకు అడ్డాగా మారింది. చాలామంది దాతలు వీటికి గింజలను ఆహారంగా వేస్తూవాటికి ఆకలి తీరుస్తున్నారు. అయితే పావురాల మల విసర్జనతో వస్తున్న వ్యాధులు విషయంలో అప్రమత్తంగా ఉండాలంటున్నారు డాక్టర్లు. నగరంలో ఎక్కువగా అమీర్‌పేట్, కెబిఆర్ పార్కు, బంజారాభవన్, నాంపల్లి రైల్వే స్టేషన్, గోషామహాల్ ,పురానాపూల్, ట్యాంక్‌బండ్, మక్కా మసీద్, కోఠి, సికింద్రాబాద్ ,ఇందిరా పార్క్ ఏరియాల్లో కనిపిస్తుంటాయి. చెట్లకొమ్మలు, కరెంట్ తీగలు, అపార్ట్‌మెంట్ విండోస్ ,ఏసీల ఔట్‌లెట్స్,మెట్రో రైల్ పిల్లర్లు, పురాతన కట్టడాలు, టూరిస్టు ప్రాంతాల దగ్గర ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఈపావురాలకు చాలామంది పక్షి ప్రేమికులు ప్రతిరోజూ దానా గింజలు వేస్తుంటారు. జంతువులు, పక్షులు అంటే ఇష్టం ఉన్నా వాటి నుంచి వచ్చే వాధులపైనా అవగాహన ఉండాలని డాక్టర్ సూచిస్తున్నారు. ఇప్పటికే నగరంలో చాలమంది కాలుష్యంతో పాటు కొవిడ్ వల్ల శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. పావురాలతో ఈసమస్య మరింత ఎక్కువగా ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు. పక్షిప్రియులు పావురాలకు గింజలు వేయాలనుకుంటే జూపార్కుల లేదా ఓపెన్ ప్లేస్‌లలో దానా వేయాలి. జనం రద్దీగా ఉన్న ఏరియాల్లో గింజలు వేస్తే ..వాటి రెట్టల నుంచి ఏర్పడే చిన్న అనువులు మనిషి ఊపిరితిత్తులల్లో వెళతాయి. దాంతో ఇంటర్ సెషల్ లంగ్స్ డిసీజెస్ వస్తాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఉదయాన్నే పావురాలు చేసే ధ్వని వల్ల కూడా కొందరు ఇబ్బందులు పడుతుంటారు. అందువల్ల వీటిని సిటీ శివారు ప్రాంతాలకు తరలించాలని కొందరు ప్రభుత్వానికి సూచిస్తున్నారు.



పావురాలను చూసి చాలామంది ముచ్చటపడుతుంటారు. కానీ వాటి నుంచి మనుషులకు అనేక ఇన్‌ఫెక్షన్లు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పావురాల రెట్ట నుంచి రెప్పల వరకు శరీరం మొత్తం రకరకాల వైరస్‌లకు అవాసంగా ఉంటుందని చెబుతున్నారు. వీటి నుంచి పదులసంఖ్యలో వైరస్‌వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పావురాల రెట్టల్లో హిస్టాప్లాస్మా అనే ఫంగస్ ఉంటుందని..దీని వల్ల హిస్టాప్లాస్మోసిస్ అనే ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ వస్తుందని చెబుతున్నారు. గబ్బిలాల రెట్టల్లోనూ ఈఫంగస్ ఉంటుందని వెల్లడిస్తున్నారు. ప్రధానంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలకు వెంటనే సోకే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. పావురాల కారణంగా చాలామందికి వారికి తెలియకుండానే దీర్ఘకాలిక శ్వావసకోశవ్యాధులు బారిన పడుతున్నారు.



# హైదరాబాద్ వార్త

# భారతీయ పండుగలన్నీ విశిష్టమైనవి

## మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



హోలీ వేడుకలనుద్దేసించి ప్రసంగిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

**ధర్నాచౌక్, మార్చి 7, ప్రభాతవార్త:** భారతీయ పండుగలన్నింటిలో ఎంతో విశిష్టత దాగి ఉంటుందని పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాట్రోఫీ శాఖా మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. మంగళవారం ఇందిరాపార్కులో నిర్వహించిన హోలీ వేడుకలలో ఆయన మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌తో కలసి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా తలసాని మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను చాటి చెప్పేవి పండుగలని పేర్కొన్నారు. ప్రతి పండుగ నిర్వహణలో ఒక విశిష్టత ఉంటుందని, అందులో హోలీ ఒకటని తెలిపారు. మనం జరుపుకునే పండుగల గురించి నేటి తరానికి తెలియదని, విదేశీ సంస్కృతికి ఆకర్షితులవుతూ, మన సాంప్రదాయాలను మర్చిపోతున్న యువతకు మన సాంప్రదాయాల గురించి తెలియచేయాల్సిన బాద్యత తల్లితండ్రులపై ఉందని అన్నారు. ప్రతి నిత్యం వేలాదిమంది తరలివచ్చే ఇందిరాపార్కు ను ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. పార్కులో చిన్నపిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక స్థలం, స్విమ్మింగ్ ఫూల్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులపై త్వరలో చర్యలు తీసుకుంటామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత హైదరాబాద్ నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ హోలీ దేశం మొత్తం ఎంతో ఘనంగా జరుపుకునే పండుగని, ప్రేమ, అప్యాయతలను రంగరించి, ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ జరుపుకుంటామని అన్నారు. ఈ వేడుకలలో కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీ, బీఆర్ఎస్ యువనాయకులు ముఠా జైసింహ, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

# హోలీ



చార్మినార్ వద్ద జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న బెంగాలీ మహిళలు



ఆర్ట్స్ కాలేజ్ ముందు జరిగిన హోలీ వేడుకల్లో ఏబీవీపీ నాయకులు



**నగరంలో వ్యాప్తంగా హోలి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు యువత చిన్నారులు పాల్గొన్ని రంగులు చల్లుకుంటు కేరింతలు కొడుతూ పండుగను జరుపుకున్నారు.**

## గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తుల అరెస్ట్

**ఉప్పల్, మార్చి 7 ప్రభాతవార్త :** ఎపిలోని సిలేరు ప్రాంతం నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురు సభ్యుల ముఠాను ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఎక్సైజ్ సిఐ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం మల్లాపూర్ ప్రాంతానికి చెందిన చీమేల శ్రీకాంత్ 23, జల్ల వంశీ, కొత్తూరి డేవిడ్, మల్లాపూర్‌కు చెందిన చిట్యాల రోహిత్ 21, మొగిలి కార్తీక్ 21, షేక్ జాన్‌బాషా 26లు ఒక ముఠాగా ఏర్పడి ఎపిలోని సీలేరు నుంచి అక్రమంగా గంజాయి తెచ్చి నగరంలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 6వ తేదిన రాత్రి సమయంలో హెచ్‌సిఎల్ క్రాస్ రోడ్డు నుంచి కారులో గంజాయి తరలిస్తుండగా పోలీసులకు అనుమానం వచ్చి ప్రశ్నించగా నిందితులు పట్టుబడినట్లు తెలిపారు. వీరిలో ఇద్దరు పరారీలో ఉన్నారని, మరో నలుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎక్సైజ్ సూపరిటెండెంట్ బి.ముకందరెడ్డి, సిఐ చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, అబ్దుల్ జబ్బార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. నిందితుల వద్ద నుంచి పది కిలోల గంజాయి, 180 గ్రాముల చరాస్, ఒక కారు, సెల్‌పోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

**ఉప్పల్, మార్చి 7 ప్రభాతవార్త :** హోలీ పండుగను దృష్టిలో ఉంచుకుని డ్రై డే రోజున అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఐదుగురిని ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హోలీ పండుగ సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకాణాల విక్రయాలు బంద్ చేసింది. ఇదే అదనుగా ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో మద్యం విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. ఉప్పల్‌కు చెందిన రమేష్, చిలుకానగర్‌కు చెందిన సోమేష్, రామంతాపూర్‌కు చెందిన శివకుమార్, కురుమనగర్‌కు చెందిన ఎ.సంపత్, చిలుకానగర్‌కు చెందిన సోనుకుమార్‌యాదవ్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి పది ఫుల్ బాటిళ్లు, 43 హాఫ్ బాటిళ్లు, 292 క్వాటర్ బాటిళ్లు, 375 బీర్లు బాటిళ్లు, మొత్తం 705 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## షాపుకు వెళ్లిన తల్లి, కూతురు అదృశ్యం

**పేట్‌బషీరాబాద్, మార్చి7 ప్రభాతవార్త:** కిరాణా దుకాణంకు వెళ్ళి వస్తానని చెప్పి వెళ్ళిన గృహిణి కుమార్తెతో సహ అదృశ్యమైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రామకృష్ణ 3నెలల క్రితం బతుకుదెరువు కోసం తన కుటుంబంతో నగరానికి వలస వచ్చి దేవరాయంజల్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే 10రోజుల క్రితం దేవరాయాంజల్‌లో ప్రహరీ గోడ నిర్మించడానికి కొంత మంది కూలీలు,రామకృష్ణ, భా ర్య రాధాభాయి(30),కుమార్తె పాయల్‌తో కలిసి పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో భార్య రాధాభాయి కిరాణాదుకాణానికి వెళ్ళి వస్తానని భర్తకు చెప్పి కుమార్తెను వెంట పెట్టుకొని వెళ్ళింది. దుకాణానికి వెళ్ళిన భార్య, కుమార్తె ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన రామకృష్ణ దుకాణం వద్ద, సమీప ప్రాంతాలు, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు.అయితే అదే ప్రాంతంలో పని చేస్తున్న రాకేష్‌నాథ్(22) కూడా కనిపించకుండా పోయాడని తెలుసుకున్న రామకృష్ణ వారిద్దరి ఆచూకీకోసం అన్ని ప్రాంతాలలో గాలించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో రామకృష్ణ తన భార్య, కుమార్తె అదృశ్యమయ్యారని పేట్బ షీరాబాద్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దార్యప్తు ప్రారంభించారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్యశిబిరం

**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:** ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా మార్చి 8నుంచి మార్చి 31వరకు మహిళల కోసం ప్రత్యేకమైన ఉచిత వైద్యశిభిరం ఏర్పాటు చేసినట్లు ఆస్టర్‌ప్రైమ్ వైద్యులు తెలిపారు. అమీర్‌పేట్‌లో ఈవైద్యశిభిరం ఏర్పాటు చేయన్నుట్లు తెలిపారు. ఈఉచిత శిభిరంలో గైనకాలజిస్టు కన్సల్టేషన్ అందజేస్తారని అలాగే వ్యాధి నిర్ధారణ పరీక్షలు అవసరమైన వారికి యాభైశాతం తగ్గింపుతో పరీక్షలు నిర్వహించున్నట్లు తెలిపారు.అలాగే మహిళల ఆరోగ్యపరిరక్షణపై పలు కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## నాట్యయోగ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డా.కె.వి.రమణాచారి

**సైఫాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీ సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగ భాషా నిలయంలో భారతీయ శాస్త్రీయ నృత్య సంఘీత రీతుల పరిశోధనాత్మక ప్రసంగ పరంపర 'నాట్య యోగ' కొనసాగుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి తెలిపారు. మంగళవారం రమణాచారి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ నాట్య యోగకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆయన అవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యువ కళాకారులకు ప్రభోదాత్మకంగా, ప్రయోజనాత్మకంగా ఉండాలని సంగీత నృత్య గురువులకు ప్రేరణను నూతనోత్సహన్ని కలిగించాలని ఆకాంక్షించారు. ఆరున్నర దశాబ్దాలుగా నవ్య నాటక సమితి సాంస్కబ్యృతిక, కళారంగానికి చేస్తున్న కృషి అపూర్వమన్నారు. ప్రతిభ, ప్రభ, నైపుణ్యం గల యువ కళకారులను ప్రోత్సహించవలసిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. నవ్య నాటక సమితి 2023-24 సంవత్సరానికి నిర్వహించే కార్యక్రమాలను సమితి ప్రతినిధి, సమన్వయకర్త నిష్ఠల సుధామాల వివరించారు. నెలనెలా భారతీయ సంగీత నృత్య రీతులపై ప్రసంగ కార్యక్రమాలు ఉగాది వసంతోత్సవం, వివిధ సంగీత పోటీలు జాతీయ స్థాయిలో శాస్త్రీయ సంగీత నృత్య పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిప్యూటి డైరెక్టర్ జి.వసుంధర, నృత్య గురువులు గీతగణేశన్, రేణుకప్రభాకర్, స్నేహారాంచందర్, సమితి అధ్యక్షుడు వి.విజయకుమార్, బి.వి.నారాయణరావు, కె.చక్రపాణి, హరినాథ్‌బాబు, పిఆర్‌ఓ జెవిబి శర్మ పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన వరాహ మహాదేశికన్ స్వామిజీ

**అల్వాల్, మార్చి 7 ప్రభాతవార్త:** శ్రీరంగ శ్రీమత్ అండవన్ ఆశ్రమం శ్రీశ్రీశ్రీ వరాహ మహాదేశికన్ స్వామిజీ మంగళవారం అల్వాల్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఉత్తర భారత యాత్ర ముగించుకుని శ్రీరంగం వెళుతు శ్రీ బాలాజీ ఆలయంకు రావడం జరిగింది. ఆలయ ఆర్చకులు స్వామీజీకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలులో పాలు పంచుకున్నారు. అనంతరం స్వామి వారు భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## మహిళలు కంటతడిపెడితే అరిష్టమే

### మహాలక్ష్మీరామన్‌గౌడ్ హెచ్చరిక



పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** మహిళలు ఎక్కడ గౌరవించబడతారో, ఆరాధించబడతారో ఆ దేశాలు అభివృద్ధి హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ చెప్పారు. మహిళలు కంటతడిపెట్టిన దేశాలు, రాష్ట్రాలు, గృహాలు అభివృద్ధి చెందవని, ఇవి చరిత్ర చెప్పిన సాక్ష్యమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా మోర్చ ఆధ్వర్యంలో మంగళవారం హిమాయత్‌నగర్‌లో ఆనేక మంది పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించిన సందర్బంగా ఆమె మాట్లాడారు. మహిళా తల్లిగా, అక్కగా, చెల్లిగా, భార్యగా, కుమార్తెగా, కోడలిగా విభిన్న పాత్రలను పోషిస్తున్న మహా ఇల్లాలని ఆ ఇల్లాలు కంటతడిపెడితే అరిష్టమేనన్నారు. గతంలో కంటే ప్రసుత్తం మహిళలు ఎంతో అభివృద్ధి సాధిస్తున్నారని, అన్ని రంగాలలో పురుషులతోపాటు సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. అయితే ఇంకా అభివృద్ధి చెందవలిసింది ఉందని, ఇంకా దాడులు, హత్యలు, అత్యాచారాలు, వివక్ష కోనసాగుతున్నదని ఇందుకు వ్యతిరేకంగా ఐక్యంగా మహిళా లోకం ఉద్యమిచాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు గౌరవం లభిస్తున్నదని, కేంద్రం మహిళలకు పెద్దపిఠవేస్తున్నదని చెప్పారు. పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా వీధులన్ని శుభ్రం చేసి మంచి పరిసరాలను అందిస్తున్నారని, వారి సేవలను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చ నాయకురాళ్ళు శారద, పద్మజా, పూజాజౌస్వాల్, సుజాత, దేవి పాల్గొన్నారు.

## ఉగాదికి శ్రీనివాసనగర్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం

### ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:** బాగ్అంబర్‌పేట్ డివిజన్ శ్రీనివాసనగర్ కాలనీలో ఎమ్మెల్యే సిడిపి నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ ఉగాదికి ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఈమేరకు మంగళవారం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించి, పనల పురోగతి గురించి అదికారులను అడిగి తెలుసుకున్నారు. వేగంగా పనులు పూర్తి చేసి ఉగాదికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి 'కంటి వెలుగు' శిబిరం

**హైదరాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నారాయణగూడలోని విక్రమ్‌నగర్ కమ్యూనిటిహాల్‌లో కోనసాగుతున్న 'కంటి వెలుగు' శిభిరాన్ని ఈ నెల 9వ తేదీ నుంచి కాచిగూడలోని భద్రుకా కళాశాలకు మార్చుతున్నామని ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి తెలిపారు. గత నెల 9వ తేదీన ఈ కమ్యూనిటిహాల్‌లో ప్రారంభమైన ఈ కంటి వెలుగు కార్యక్రమంలో ఆనేక మందికి సేవలు అందించడం జరిగిందని, 9వ తేదీ నుంచి భద్రుకా కాలేజీలో సేవలు లభిస్తాయని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కంటికి పరీక్షలు నిర్వహిస్తామని, అవసరమైతే కంటి అద్దాలతోపాటు ఉచితంగా మందులు పంపిణి చేస్తామని, సరైన కంటి అద్దాలు లేకపోతే ఆర్డర్ ఇచ్చి తెప్పించి పంపిణి చేస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని డాక్టర్ విజ్ఞప్తి చేశారు.

## అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘం నూతన అధ్యక్షుడిగా డా. సుధాకర్ ఎన్నిక

**సైఫాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** యుద్ధానికి వ్యతిరేకంగా శాంతిని, భద్రతను, మానవ హక్కులను కాపాడటం కోసం అంతర్జాతీయ సమాజాన్ని ఏకం చేసి ఉద్యమాలు నిర్మిస్తామని అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘంకు నూతనంగా ఎన్నికైన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన డాక్టర్ సుధాకర్ అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘంలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ యుద్ధాలకు, మతోనా్మదానికి వ్యతిరేకంగా శాంతిని కాపాడటానికై జరిగిన ఆనేక ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించారు. ఇటీవల మూడు రోజుల పాటు ఛండీఘడ్ నగరంలో జరిగిన సంఘం జాతీయ మహాసభల్లో జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఆయనతోపాటు పల్లబ్‌సేన్‌గుప్తా, నీలోత్పల్‌బసు జాతీయ అధ్యక్ష వర్గంగా, అరుణ్‌కుమార్, హరిచంద్‌సంగ్‌బట్‌లు జాతీయ ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైనారు.




## వార్త మహిళా జర్నలిస్టులకు సన్మానం

**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళా జర్నలిస్టులకు సన్మానం జరిగింది. మంగళవారం పీపుల్స్ ప్లాజాలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐటి మంత్రి కెటిఆర్, విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, సిఎస్ శాంతి కుమారిలు పాల్గొని ,జర్నలిస్టులను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వృత్తిలో తమ నైపుణ్యతను ప్రదర్శిస్తున్న మహిళా జర్నలిస్టులకు శాలువాతో సత్కరించి ప్రశంస పత్రాన్ని అందజేశారు. "వార్త "దినపత్రికలో సబ్ ఎడిటర్లుగా పనిచేస్తున్న బి.మీనాక్షి, కె.సుధ ,ఎ.శోభారాణిలు, హిందీ విభాగంలో ధనరేఖ సన్మానం పొందినవారిలో ఉన్నారు.



# ప్రభుత్వ నిధులతో పనులు

## శిలాఫలకంపై ప్రైవేటు వ్యక్తుల పేర్లు



శిలాఫలకం దృశ్యం

ఎల్.బి.నగర్, మార్చి 7 ప్రభాతవార్త : ప్రభుత్వ సొమ్ముతో చేపడుతున్న పనుల లో ప్రైవేటు వ్యక్తులపేర్లు శిలాఫలకపై ఏర్పాటుచేయడం వివాదంగా మారింది. ఆర్కేపురం శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ఎమ్మెల్సీ నిధులతో ఎల్ఈడి లైట్స్, ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు చేస్తున్నారు. జనవరి నెలలో ప్రారం భిస్తున్నట్లు శిలాఫలకం కూడా ఏర్పాటుచేశారు. శిలాఫలకంలో స్థానిక మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ, కార్పొరేటర్ పేర్లతోపాటు గతంలో దేవాలయం చైర్మన్గా ఉన్న జగిని రమేష్, దేవాలయం ఈవో సిహెచ్.రంగారావు పేర్లను కూడా ఏర్పాటు చేయడంపట్ల కాంగ్రెస్, బిజెపి డివిజన్ అధ్యక్షులు పున్న గణేష్నేత, రాములు యాదవ్తో పాటు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేస్తున్న పనులకు ప్రజాప్రతినిధులతో పాటు ఇతరు ల పేర్లను శిలాఫలకపై ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చింద ని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనులలో ప్రైవేట్ వ్యక్తులకు ప్రాధాన్యతనిస్తూ శిలాఫలకంపై పేరుపెట్టడం ఎంతవరకు సమంజసమని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ శాఖకు సంబంధించి న ఈవో పేరుతోపాటు బిఆర్ఎస్పార్టీకి చెందిన జగిని రమేష్ పేరు కూడా పెట్టాల్సిన అవసరం ఏం వచ్చిందని వారు ప్రశ్నిస్తున్నారు. జనవరిలో తయారైన శిలాఫలకం మార్చిలో ప్రారంభించడానికి ఏర్పాటు జరుగుతున్నాయని నిబంధనకు విరుద్ధంగా శిలాఫలకంపై పెట్టిన జగిని రమేష్, రంగారావు పేర్లను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ సత్యదేవుని కల్యాణోత్సవం



శ్రీ సత్యనారాయస్వామి కల్యాణోత్సవం సందర్భంగా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే బేతి, మేయర్ విజయలక్ష్మి తదితరులు

రామంతాపూర్, మార్చి 7 ప్రభాతవార్త : రామంతాపూర్లోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో అర్థ శతాబ్ది వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటి ఫౌండర్ చైర్మన్ కోట్ల నరసింహారెడ్డి, కార్య నిర్వహణాధికారి ఎం.సత్యచంద్రారెడ్డి, కార్యకర్తలు ఎ.జగదీష్ కుమార్, కె.శ్రీనివాస్రెడ్డి, విజయభాస్కర్, ఆలయ సిబ్బంది ఆర్.మురళీదర్రావు, ఎస్.శంకర్ తదితరుల ఆధ్వర్యంలో జరి గిన కల్యాణోత్సవానికి రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే బేతి సుభాష్రెడ్డి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరుల పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంగళవారం స్వామి వారికి అభిషేకం, సేవాకాలం, శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి తిరుకల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ, గరుడ వాహన సేవ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సత్యనారాయణస్వామి ఆల యం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఏటా ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం అభినందనీయమ న్నారు. అదే విధంగా 8వ తేది హోమము, బలిహరణము, సుదర్శన నారసింహా ఇష్టి, శ్రీవారి గజవాహన రథోత్సవ సేవ, ఈనెల 9వ తేదిన సేవా కాలం, హోమము, బలిహర ణము, అష్టోత్తర శతకళశాభిషేకం, మంగళాశాసనం, హను మద్ వాహనసేవ, ఈనెల 10వతేదిన హోమము, చక్ర తీర్థం, పుష్పయాగం, చంద్రపభ వాహనసేవ, దేవతావిస్తర్జన, స్వామి వారికి డోలోత్సవం, ఆశీర్వచనం, పండిత సన్మానం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్ణ నాగేశ్వర్రావు, దర్గ దయాకర్రెడ్డి, బిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, గంధం నాగేశ్వర్రావు, గడ్డం రవికుమార్, బన్నాల ప్రవీణ్ ముది రాజ్, సోమిరెడ్డి, సూరం శంకర్, జెసిబి రాజు పలువురు ఆలయ కమిటి నేతలు పాల్గొన్నారు.

# అరెస్టయిన కాంగ్రెస్ నేతలకు మేయర్ పారిజాత పరామర్శ



అరెస్టయిన కాంగ్రెస్ నేతలను పరామర్శిస్తున్న పారిజాత

సరూర్నగర్, మార్చి 7 ప్రభాతవార్త: ఎల్బినగర్లో ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంలో జరుగుతున్నజాప్యానికి నిరసనగా ధర్నా కు ప్రయత్నించి అరెస్టయి బాలాపూర్ పిఎస్కు తరలించబడ్డ పలువురు కాంగ్రెస్ నాయకులను మంగళవారం మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సిం హారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె బడంగ్పేట్ మున్సిపల్ మాజీ వైస్చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, కార్పొ రేటర్ పెద్దబావి సుదర్శన్రెడ్డి, పలువురు నాయకులు, కార్య కర్తలతో పాటు మహిళా నాయకురాలు తూళ్ళ సునీతగౌడ్ తదితరులతో కలిసి పిఎస్కు వచ్చి ఎల్బినగర్ నియోజక వర్గానికి చెందిన లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జక్కిడి ప్రభాకర్రెడ్డి, మిద్దెల జితేందర్ తదితరులను పరామర్శించి అరెస్టులను ఖండించారు.

# ఉప్పల్ సర్కిల్లో హోలీ వేడుకలు



హోలీ వేడుకల్లో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి తదితరులు

ఉప్పల్, మార్చి 7 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామంతాపూర్లో జరిగిన శ్రీ సత్యదేవుని కల్యాణోత్సవానికి విచ్చేసిన నగర మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్ణ నాగేశ్వర్రావు తదితరులు హోలీ పండుగ జరుపుకున్నారు. హోలీ వేడుకలను ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకోవడం అభినందనీయమన్నారు. కుల, మతాలకతీతంగా ప్రతి ఒక్కరు హోలీ జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# ఎల్బినగర్లో ఉద్రిక్తత - అరెస్టు చేసిన పోలీసులు

## ఫ్లై ఓవర్ ప్రారంభిస్తామని భీష్మించిన కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ నాయకులను తరలిస్తున్న పోలీసులు

మన్సూరాబాద్, మార్చి 7 ప్రభాతవార్త: ఎల్బినగర్ బివికే మాల్ వద్ద నూతనంగా నిర్మంచిన ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవాన్నిన గ్రేటర్ అధికారులు జాప్యం చేస్తున్నారని, తామే ప్రారంభిస్తా మని మంగళవారం ఎల్బినగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇం చార్జీ జక్కిడి ప్రభాకర్రెడ్డి, టిఎన్టియుసి రాష్ట్ర అధ్యక్షుడు మిద్దేల జితేందర్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్రెడ్డితో పాటు స్థానిక నాయకులు మూకుమ్మడిగా ఫ్లైఓవర్ వద్దకు రాగానే ఎల్బినగర్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బాలా పూర్ పోలీస్స్టేషన్కు తరలించారు. కాగా గత కొన్ని రోజుల క్రితం ఎల్బినగర్లో ఫ్లైఓవర్ నిర్మించినప్పటికి ఎన్నికల కోడ్ సాకుతో ప్రారంభించకుండా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు సృష్టి స్తున్నారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్రెడ్డి, జిహెచ్ఎంసి అధి కారులపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడంతో పాటు సోమవారం వరకు ఫ్లైఓవర్ను ప్రారంభించాలని లేకుంటే తామే ముందుండి ఫ్లైఓవర్ ప్రారంభిస్తామని అల్టిమేటం జారీ చేశారు. దీంతో ఎల్బినగర్చౌరస్తాలో మంగళవారం ఉదయం నుంచే ఎల్బినగర్ ఏసిపి శ్రీధర్రెడ్డితోపాటు సిఐ అంజిరెడ్డి ఇతర పోలీసు సిబ్బంది ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా ఎట్టి పరిస్థితిలో ఫ్లైఓవర్ ప్రారంభిస్తామని చెప్పిన నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఒక్కసారిగా ఎల్బినగర్ వద్దకు రావడం తోన కొంత ఉద్రిక్త వాతావారణం చోటుచేసుకుంది. వారిని ఫ్లైఓవర్ వద్దకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకుని వారిని అదుపులోకి తీసుకుని డిసిఎం వ్యానులో బాలాపూర్ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా జక్కిడి మాట్లాడుతూ ఎల్బినగర్లో ఫ్లైఓవర్ పూర్తయిన ప్రారంభించకపోవడంతో ప్రజలు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నారన్నారన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో లబ్ది పొందాలని చూస్తూ ఈ ఫ్లైవర్ ప్రారంభించకుండా అడ్డుపడుతూన్నరని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బర్రె రాజుకుమార్, రాజశేఖర్, బుద్ద సత్యానారాయణ, మల్లారపు శ్రీను, శశిదర్రెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

# రేపటి నుండి పహాడీషరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలు



సందల్ ఉరేగింపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిసిపి శ్రీనివాస్

సరూర్నగర్, మార్చి 7 ప్రభాతవార్త: రంగారెడ్డి జిల్లా మహే శ్వరంనియోజకవర్గం బాలాపూర్ మండలంలోని పహాడీషరీఫ్ గ్రామంలోనున్న చారిత్రాత్మక హజ్రత్ బాబా షరు ఫ్దీన్ దర్గాలో ఈ నెల 9వ తేదీ నుండి 757వ ఉర్సు ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. వందల సంవత్సరాల చరిత్ర గల ఈ దర్గాలో ప్రతి సంవత్సరం ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాలకు తెలంగాణలోని వివిధ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. అయితే ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుం టాయి. ముస్లింలతో పాటు హిందువులు కూడా పెద్ద సంఖ్య లో ఉత్సవాలకు హాజరవుతుంటారు. అయితే ఈ నెల 9వ తేదీ నుండి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న రాత్రి 12 గంటలకు బాలాపూర్ నుం డి గంధం ఉరేగింపును దర్గా వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 15న చద్దర్, పూలు సమర్పణతో ఉర్సు ఉత్సవాలు ముగుస్తాయి.

**బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన డిసిపి...** పహాడీషరీఫ్ ఉర్సు ఉత్సవాల సందర్భంగా మహేశ్వరం డిసిపి శ్రీనివాస్ బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. బాలాపూర్ నుండి పహాడీషరీఫ్ దర్గా వరకు సందల్ ఉరేగింపు జరుగనున్న నేపథ్యంలో ఆయన మహేశ్వరం ఎపిపి అంజయ్య, బాలా పూర్ ఇన్స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్, పహాడీషరీఫ్ ఇన్స్ పెక్టర్ కిరణ్, బాలాపూర్ ఎస్ఐ సైదులు తదితరులతో కలిసి ఉరేగింపు రూట్లో పర్యటించారు. ఈ క్రమంలో ఆయన బాలాపూర్కు విచ్చేసి సందల్ ప్రారంభంకానున్న ప్రాంతాన్ని, బాబాషర్ఫుద్దీన్ సందల్ ఇంటిని స్థానికులు తూళ్ళ సత్తయ్య గౌడ్, తూళ్ళ మల్లేష్ గౌడ్, తూళ్ళ హరిబాబుగౌడ్, తూళ్ళ నరహరిగౌడ్, తూళ్ళ నర్సింగ్రావుగౌడ్, అమ్మ కొండయ్య స్వామిలతో పాటు సయ్యద్ ముస్తఫా అలీ తదితరులతో కలిసి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# అందరి జీవితాల్లో నూతన వెలుగులు నిండాలి : సామ



హోలీ సంబరాల్లో పాల్గొన్న సామ రంగారెడ్డి

ఎల్.బి.నగర్, మార్చి 7 ప్రభాతవార్త : హోలీ సంబరాలు అం దరి జీవితాల్లో నూతన వెలుగులు నిండాలని రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి పేర్కొన్నారు. గడ్డిఅన్నా రం డివిజన్ కాలనీవాసులు, కార్యకర్తలతో కలిసి హోలీ సం బరాలలో సామ పాల్గొనగా ఆయనకు రంగులు రుద్ది మిఠా యిలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయం సాధించిన సందర్భంగా జరుపుకునే పండుగ హోలీ అన్నారు. రాగద్వేషాలకతీతంగా అందరిని ఒకదగ్గరికి చేర్చ డం ఈ పండుగ ప్రత్యేకతన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బద్దం ప్రేమ్మహేశ్వర్రెడ్డి, డివిజన్ బిజెపి అధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు కార్యకార్తలు పాల్గొన్నారు.

# తెలంగాణాలో మార్పు జరగాలి: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



బండి సంజయ్ను సన్మానిస్తున్న ఎవిఎన్ రెడ్డి

సైదాబాద్, మార్చి 7 ప్రభాతవార్త: తెలంగాణాలో మార్పు జరగాలని, నియంత పాలనకు స్వస్తి పలకాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణా ప్రాంత ఉపాధ్యాయ సంఘం, బిజెపి మద్దతిస్తున్న ఎవిఎన్ రెడ్డికి మద్దతుగా చంపాపేటలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజల కోసం ఇప్పటికే చాలా సార్లు జైలుకు వెళ్లానని, దేశం కోసం ధర్మంకోసం అవసరమైతే మరోసారి జైలుకు వెళ్లడానికి సిద్ధ మన్నారు. బిఆర్ఎస్ పాలకులు నిజాం నియంతృత్వ పాలన ను తలపిస్తున్నారని అన్నారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం టీచర్ల ఎన్నికలు మాత్రమే కాదని తెలంగాణా ప్రజల భవిష్యత్తును నిర్ణయిస్తాయని, ఓటు వేసే ముందు ప్రతి ఒక్కరు ఆలోచించాలన్నారు. 317 జిఓ గురించి కొట్లాడుతు న్న ఏకైక పార్టీ బిజెపి మాత్రమేనని అన్నారు. తెలంగాణాలో వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని, బిజెపి అధికారంలోకి రాగానే జిఓ317ను సవరిస్తుందని, బాధితులందరికి న్యాయం చేస్తుం దన్నారు. తెలంగాణాలో మార్పు జరగాలని, నియంత పాల నకు స్వస్తి పలకాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు రాంచందర్రావు, మోహన్రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, అర్బన్ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డబుల్బెడ్రూం ఇళ్ల కేటాయింపులో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న శ్రీధర్గౌడ్, నాయకులు

హయత్నగర్, మార్చి 7 ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో హయత్నగర్ మండల పరిధిలో నిర్మిస్తున్న డబుల్బెడ్రూం ఇళ్లల్లో స్థానిక హయత్నగర్ గ్రామస్తులకు ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ బీఆర్ఎస్ హయత్నగర్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్గౌడ్ ఎమ్మెల్యే సుధీర్రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్గౌడ్ మాట్లాడుతూ హయత్నగర్ గ్రామంలో ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, పేద మధ్య తరగతి వర్గాలకుచెందిన ప్రజల ఇళ్ల స్థలాలు లేవన్నారు. కుటుంబా లు పెరిగి ఆర్థిక ఇబ్బందులతో అద్దెలు కట్టలేక ఇబ్బందుల పాలవుతున్నారని వివరించారు. మండలపరిధిలో నూతనంగా నిర్మించిన డబుల్బెడ్రూం ఇళ్లల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. హయత్నగర్లోని 207 సర్వేనెంబరు ప్రభుత్వస్థలంలో మాల సామాజికవర్గానికి కమ్యూనిటీ హాలు నిర్మించుకోవడానికి స్థలం కేటాయించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకు కోదండ లక్ష్మిదాసు, ఏర్పుల ముత్యాలు, దేవ ప్రసన్న కుమార్, కోదండ సురేష్, రాజేందర్ పాల్గొన్నారు.

# మాతృదేవోభవలో హోలీ వేడుకలు



హోలీ సంబరాలు చేస్తున్న ఆశ్రమంలోని అనాథలు

సరూర్నగర్, మార్చి 7 ప్రభాతవార్త: బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లోని నాదర్గుల్లోనున్న మాతృదేవోభవ అనాథా శ్రమంలో మంగళవారం హోలీ సంబరాలు ఘనంగా జరిగా యి. మతిస్థిమితం లేని అనాథలు, అభాగ్యులను ఆదరిస్తున్న ఆశ్రమ వ్యవస్థాపకుడు గట్టు గిరి, ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో హోలీ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న అనాథలు ఉత్సాహంగా హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు రంగులు పులుపుకొని ఆనందంగా గడిపారు.

# ఘనంగా హోలీ పండుగ వేడుకలు



లక్ష్మారెడ్డిపాలెం సాయికుటీర్లో హోలీ వేడుకల్లో కాలనీవాసులు

హయత్నగర్, మార్చి 7 ప్రభాతవార్త: రంగుల కేళీ హోలీ పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకున్నారు. ఉద యంనుంచి పిల్లలు రంగులనుపట్టుకుని స్నేహితులు, బంధు వులకు పూస్తూ హోలీని ఘనంగా చేసుకున్నారు. పెద్దఅంబర్ పేట మున్సిపాలిటీ పరిధి లక్ష్మారెడ్డిపాలెంలోని సాయికుటీర్ కాలనీలలో కాలనీ అధ్యక్షుడు మధుసూదన్రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు రసాయనాలతో కాకుండా సహజసిద్ధమైన రం గులను వాడి హోలీని జరుపుకున్నారు. ముఖ్యంగా యువతు లు, మహిళలు హోలీ పండుగలో భాగస్వాములై నృత్యాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు.

# మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : చైర్పర్సన్ అనితానాయక్



ఆశా వర్కర్స్కు చీరలను అందజేస్తున్న చైర్పర్సన్ అనితానాయక్

మలక్పేట, మార్చి 7 ప్రభాతవార్త : సిఎం కెసిఆర్ మహిళల సంక్షేమంకోసం ఎంతో కృషి చేస్తుందని నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ అనితానాయక్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వ హించిన కార్యక్రమంలో పలువురు ఆశా వర్కర్లకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం మహిళల అభ్యున్నతికి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. మహిళలు ఆత్మ విశ్వాసంతో పట్టుదలతో ముందడుగు వేసి లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం : క్యామ మల్లేష్



యాదగిరి మృతదేహానికి నివాళులర్పిస్తున్న క్యామ మల్లేష్

తుర్కయంజాల్, మార్చి 7 ప్రభాతవార్త : తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూరు గ్రామానికి చెందిన సాగరి యాదగిరి మృతి చెందిన విషయం తెలుసుకొని బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ ఆయన పార్థివ దేహానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులు వంగే టి లక్ష్మారెడ్డి, డైరక్టర్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీ మేకం యాదయ్య, ప్రబువర్ధన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వివేక్నగర్లో అభివృద్ధి పనులు



సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

ఉప్పల్, మార్చి 7 ప్రభాతవార్త : రామంతాపూర్ వివేక్నగర్ కమ్యూనిటిహాల్లో చేపడుతున్న సిసి రోడ్డు పనులను మం గళవారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అభివృద్ది పనుల విషయంలో నాణ్యత పాటించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. డివిజన్లో పెండింగ్లో ఉన్న పను లు త్వరితగతిన పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటు న్నామన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ మహేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మలక్పేటలో ఘనంగా హోలీ వేడుకలు



హోలీ వేడుకలను నిర్వహిస్తున్న హరిగోవింద్ప్రసాద్ తదితరులు



వేడుకలు నిర్వహిస్తున్న రాజశేఖర్రెడ్డి, రవికుమార్ తదితరులు

మలక్పేట, మార్చి 7 ప్రభాతవార్త : మలక్పేటలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మూసారాంబాగ్ ఎస్బిఐ కాలనీలో శ్రీరామ్ మిత్ర మండలి మూసారాంబాగ్ కన్వీనర్ హరిగోవింద్ ప్రసాద్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. అదే విధంగా ఓల్డ్ మలక్పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్రెడ్డి ఆధ్వర్యంలో హోలీ వేడు కలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ మలక్పేట ఉత్సవ కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్, వేముల విజయ్కుమార్, బుగడల బాబురాజు, రాజారావుగౌడ్, రాజు, లక్ష్మన్, రామకృష్ణ, రాంబాబు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో వివాహం

ఎల్.బి.నగర్, మార్చి 7 ప్రభాతవార్త : మొగుళ్ళపల్లి యువ సేన ఆధ్వర్యంలో 204వ ఉచిత వివాహం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేందర్గుప్తా తెలిపారు. జగదీష్, సంతోషిలకు, విజయ్కుమార్, నికితలకు సంప్రదాయ పద్ధతి లో అన్నిరకాల వస్తువులతో బంగారుపుస్తె, మట్టెలు, బట్టలు అందజేసి, బంధువులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్నామ న్నారు. ఉచిత వివాహానికి స్నేహితులు, బంధువులు అండ దండగా నిలుస్తూ పేదవారికి ఉచితంగా వివాహాలు చేసే భాగ్యాన్ని కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ సాయినగర్లో కాముడి దహనం

నేరేడ్మెట్, మార్చి 7 ప్రభాతవార్త: మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని వినాయక్నగర్ డివిజన్ శ్రీ సాయినగర్లో అదివా రం రాత్రి కాముడి దహనం కార్యక్రమం ఏర్పాటు చేసారు. సంక్షేమ సంఘం అధ్యక్ష్య, కార్యదర్శులు వెంకన్నగౌడ్, బుగ్గ ఉపేందర్లు కాలనీ సంక్షేమ సంఘం భవనం వద్ద హోలీ పండుగ సందర్భంగా సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి కాముడిని ఏర్పాటు చేయడం జరిగింది. రాత్రి 12గంలకు దహన కార్యక్రమం నిర్వహించి సభ్యులతో హోలీ అడారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ హోలీపండుగను కాలనీ వాసులు సంతోషంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సుభాష్ గుప్తా, సలహాదారులు ఇస్తారి, చెట్టప్ప, ఉపాధ్యక్షులు గ్యారల రమేష్, రొయ్యల క్రిష్ణ, సహాయ కార్యదర్శులు శ్యామల వెంకటేష్, ప్రచార కార్యదర్శులు ఎం. బాల్రాజ్, సోమేష్, వంగరి శ్రీనివాస్, నాగరాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# విషం తాగి వృద్ధుడి మృతి

నేరేడ్మెట్, మార్చి 7 ప్రభాతవార్త: ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన నేరేడ్మెట్ పోలీస్స్టేషన్ పరిధిలో చోటు చేసుకుం ది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రగిరి కాలనీలో నివాసముండే దేవేంద్ర ప్ప(73) గత నెల 27వ తేదీనా ఇంట్లో విషం తాగాడు. విష యం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే దేవేంద్రప్ప ను సికింద్రాబాద్లోని సన్షైన్ అసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 6వ తేదీనా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



హోలీ పండుగ సందర్భంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేముల అమరేందర్ రెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మునగనూర్ గ్రామంలోని వివిధ కాలనీల నుండి వచ్చి కాలనీ వాసులకు రంగ వైభవంగా హోలీ పండుగ అందరితో ఆడి శుభాకాంక్షలు తెలియజేసి అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

(ప్రభాతవార్త, తుర్కయంజాల్)

# ప్రభుత్వ పాఠశాలలో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు : బండారి



వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకిస్తున్న బండారి లక్ష్మారెడ్డి తదితరులు

రామంతాపూర్, మార్చి 7 ప్రభాతవార్త : రామంతాపూర్ ప్రభు త్వపాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ప్రధానో పాధ్యాయుడు సాంబయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మానికి బిఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మా రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠ శాల అభివృద్ధికి తమ వంతు చేయూత అందిస్తామన్నా రు. ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాల కల్పనకు తగు సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శలు తిలకించి విద్యార్థులను అభినందించారు. మధ్యా హ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బిఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్రావు, పి.శ్రీకాంత్ గౌడ్, బోసాని పవన్కుమార్, సూరం శంకర్, సంబెట్ నరేష్, చిన్నారావు, చాంద్పాషా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సహకారంతో స్మశాన వాటికల అభివృద్ది



ముస్లిం, మైనార్టీ స్మశానవాటికను శుభ్రం చేసిన దృశ్యం

ఉప్పల్, మార్చి 7 ప్రభాతవార్త : ఉప్పల్లోని ముస్లిం స్మశాన వాటికల అభివృద్ధికి ఎమ్మెల్యే బేతి సుభాష్రెడ్డి తగు సహకా రం అందిస్తున్నారని ఉప్పల్ మైనార్టీసెల్ యూత్ అధ్యక్షుడు ఇర్షాద్ఖాన్ అలియాస్ ఉప్పల్ఖాన్ పేర్కొన్నారు. ఈ మేరకు ముస్లిం స్మశానవాటికను పరిశీలించి తగు సూచ నలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో స్మశానవాటిక లో మౌళిక సదుపాయాలు కల్పించారని తెలిపారు. తెలంగా ణలో ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి బిఆర్ఎస్ పార్టీ చేయూత అందిస్తుందన్నారు. ఉప్పల్ ముస్లిం స్మశానవాటిక లో సదుపాయాలు కల్పించి తగు చేయూత అందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీసెల్ నేతలు పాల్గొన్నారు.

# హోలీ సంబురాల్లో చిన్నారులు





హోలీ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్రెడ్డి క్యాంపు కార్యాలయంలో వద్ద ఎమ్మెల్యే సిబ్బందితో కలిసి వేడుకలలో పాల్గొన్నారు. (ఎల్.బి.నగర్, ప్రభాతవార్త)